క్లుప్తంగా

పోలీస్ కళాజాతా



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ రాజు

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం గ్రామంలో గీసుకొండ పోలీసుల అధ్వర్యంలో బుధవారం పోలీస్ కళాజాతాను నిర్వహించారు. కళాకారులు తమ సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా మూఢనమ్మకాలు, డయల్-100, బాల్య వివాహాలు, ఆత్మహత్యలు తదితర సామాజిక రుగ్మతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు పాల్గొని మాట్లాడుతూ.. ప్రజలు సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. వ్యసనాల జోలికి వెళ్లొద్దన్నారు. ఎస్సైలు వెంకన్న, సందీప్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన

వరంగల్(పర్వతగిరి) : వాహనదారులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని ఏఎస్సై యాదగిరి సూచించారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఎండాకాలంలో వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల్లో వాహనాలు పార్కు చేయడం వల్ల జరిగే ప్రమాదాలు, వాహనాల్లో పెట్రోల్, డీజిల్ పోసుకునేటప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. వాహనాలపై ప్రయాణం చేసేటప్పుడు తప్పనిసరిగా తాగునీరు వెంట తీసుకెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ చిన్న రాజు, హోంగార్డులు గౌరీశంకర్, ఆశీర్వాదం పాల్గొన్నారు.

వేలం వాయిదా

వర్ధన్నపేట : వర్ధన్నపేట పట్టణంలోని పబ్లిక్ టాయిలెట్స్‌లో గల నాలుగు గదుల షెటర్లు అద్దెకు ఇవ్వడం కోసం బహిరంగ వేలం వేయడానికి ఈ నెల 21న నోటిఫికేషన్ జారీ చేశారు. కానీ అనివార్యకారణాల వల్ల వేలం వాయిదా వేశామని మున్సిపల్ కమిషనర్ గొడిశాల రవీందర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. తదుపరి వేలం ఎప్పుడు అనేది మళ్లీ ప్రకటిస్తామని రవీందర్ తెలిపారు.

ఎంపీడీఓను కలిసిన కారోబార్‌లు

సంగెం : ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్‌రావును మండల కారోబార్‌లు బుధవారం కలుసుకున్నారు. ఎంపీఓ కొమురయ్య ఆధ్వర్యంలో ఎంపీడీఓకు పూలబొకే అందించి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కారోబార్‌ల సంఘం మండల అధ్యక్షుడు దొనికెల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గుగులోత్ సుమన్, జాటోత్ నరేందర్, ఎరుకల రాజమౌళి, బొమ్మెర రవి, గుగులోత్ యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

వరంగల్(పర్వతగిరి) : మండలంలోని రావూరు గ్రామానికి చెందిన బండి ఎల్లగౌడ్ ఇటీవల తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. కాగా పర్వతగిరి కౌండిన్య గౌడ పరపతి సంఘం సభ్యులు బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల సాయం అందజేశారు.

పరామర్శ

వర్ధన్నపేట : వర్ధన్నపేట పట్టణ కౌన్సిలర్ పూజారి సుజాతరఘును డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు తదితరులు బుధవారం పరామర్శించారు.

మొక్కలను కాపాడాలి



చెన్నారావుపేట : మానవ మనుగడకు చెట్లే ఆధారమని గ్రీన్ ఇండియా ఛాలెంజ్ అవార్డు గ్రహీత, వన ప్రేమికుడు నల్లగొండ సమ్మయ్య అన్నారు. ఈ మేరకు మండలంలోని తోపనగడ్డ తండా గ్రామంలోని హనుమాన్ దేవాలయం వద్ద గురుస్వామి జయరాం సమక్షంలో రావి, వేప మొక్కలను బుధవారం నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బానోత్ బాలు, మాలోత్ రమేష్, తదితరులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



నర్సంపేట : నర్సంపేట ద్వారకపేటలోని శ్రీవేణుగోపాలస్వామి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు ఆరుట్ల వెంకటాచార్యులు పూజా నిర్వహణలో ఆలయ చైర్మన్ గంధం నరేందర్ ఆధ్వర్యంలో తొళక్కము ప్రారంభం, అల్వార్ మర్యాద, మంగళస్నానం, తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పెద్ది తదితరులు

నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నియోజకవర్గానికి చెందిన 70మంది లబ్ధిదారులకు రూ.19లక్షల 52వేల విలువైన సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నర్సంపేట పట్టణంలో మంగళవారం నిర్వహించిన నియోజకవర్గ ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేసిన పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. రూ.2కోట్లతో ఏర్పాటు చేయనున్న బీఆర్ ఎస్ పార్టీ కార్యకర్తల సంక్షేమ నిధికి విరాళాలు అందించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరులో నర్సంపేట నియోజకవర్గం మూడో స్థానంలో ఉందన్నారు. హైదరాబాద్, వరంగల్, నర్సంపేట ప్రాంతంలోని ఏ ప్రైవేట్ ఆస్పత్రిలోనైనా ఆరోగ్యశ్రీ పథకం కింద వర్తించని అనేక రోగాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వైద్యం పొంది ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం పొందవచ్చన్నారు. తెల్ల రేషన్‌కార్డు, ఫుడ్ సెక్యూరిటీ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరూ సీఎం రిలీఫ్ ఫండ్‌కి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఆర్‌ఎస్‌ఎస్ కన్వీనర్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ పోరాట యోధుడు కొమురంభీం

ఆదివాసీల పోరాట యోధుడు, తెలంగాణ ప్రజా పోరాటాలకు దిక్సూచి కొమురంభీం అని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని పాకాల రోడ్‌లో ఏర్పాటు చేసిన కొమురంభీం విగ్రహాన్ని బుధవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్, స్థానిక కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు, ఆదివాసీ నాయకులు గొంది నాగేశ్వరరావు, ఈసం స్వామి, పోదెం రాణి, వాసం కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్‌ల సమస్య పరిష్కరించాలి



ఖానాపురం: ఎస్సై తిరుపతికి వినతిపత్రం అందిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు



నల్లబెల్లి : సమ్మె నోటీస్ అందజేస్తున్న జేపీఎస్‌లు

ఖానాపురం : జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు యుగేందర్, బాలు, అబేద డిమాండ్ చేశారు. ఈ మేరకు శాంతియుతంగా సమ్మె చేస్తున్నామని, ఈనెల 28 నుంచి పూర్తిస్థాయి సమ్మెకు వెళ్తున్నట్లు తెలుపుతూ బుధవారం ఎస్సై తిరుపతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా పని చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం జూనియర్ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కార్యదర్శులు సోని, వరుణ్, దేవేందర్, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు. కాగా జిల్లా ఉన్నతాధికారులు అభివృద్ధిపై నిత్యం తెలుసుకోవడానికి ఏర్పాటు చేసిన సామాజిక మాధ్యమ గ్రూప్‌ల నుంచి సైతం బయటకు వచ్చి నిరసన వ్యక్తం చేశారు.

సమ్మె నోటీస్ అందజేత

నల్లబెల్లి : జూనియర్ పంచాయతీ కార్యదర్శులు బుధవారం సమ్మె నోటీస్ అందించారు. ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ అబిద్ అలీ, పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్‌కు అందించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల కార్యదర్శి శ్రవణ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిచో ఈ నెల 28వ తేదీనుంచి సమ్మెలో పాల్గొంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేపీఎస్‌లు యాదగిరి, ప్రశాంత్, విష్ణు, అనిల్, శ్రీకాంత్, జ్యోతి, అనిత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు సహకరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకన్న

నెక్కొండ : కొత్తగా ఓటరు నమోదు చేసుకునే అవకాశం ఉన్నందున అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని తహసీల్దార్ డీఎస్. వెంకన్న అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడాదిలో నాలుగుసార్లు దరఖాస్తు తీసుకోవాలని ఎన్నికల సంఘం నిర్ణయించిన విషయం విదితమేన్నారు. అందులో భాగంగా ఏటా జనవరి, ఏప్రిల్, జూన్, అక్టోబర్‌లో కొత్త ఓటర్ల నమోదుతోపాటు మార్పులు, చేర్పులు, తొలగింపు ప్రక్రియ కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఓటరు నమోదు ప్రక్రియ నిరంతరం జరుగుతుందని చెప్పారు. ఓటరు నమోదుకు ఫారం-6, తొలగింపులకు-7, సవరణలకు-8ని దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో డీటీ రాజ్‌కుమార్, ఆర్‌ఐ నరేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు సింగారపు సురేష్, వైఎస్సార్‌టీపీ భూక్యా సురేందర్, సీపీఎం ఈదునూరి వెంకన్న, సీపీఐ కందిక చెన్నకేశవులు, నాయకులు ఈదునూరి సాయికృష్ణ, పలుసం ముత్తయ్య, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా వాటర్ ప్లాంట్



చెన్నారావుపేట : ప్రజలకు శుద్ధిచేసిన నీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ఆటలకు నిలయమైంది. వివరాలు.. మండలంలోని అక్కల్‌చెడ గ్రామస్తులకు సురక్షితమైన నీటిని అందించడానికి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఐదేళ్ల క్రితం వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. నాలుగు నెలల క్రితం మరమ్మతులకు రావడంతో ఎవరు పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణను వివరణ కోరగా మరమ్మతులకు గురైంది. వెంటనే రిపేర్ చేయించి ప్రజలకు నీటిని అందిస్తామని తెలిపారు.

‘వ్యాపారులకు సహకరిస్తున్న అధికారులు’



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు, రైతులు

నెక్కొండ : పంట ఉత్పత్తులను విక్రయించేందుకు వచ్చే రైతులను పట్టించుకోవల్సిన మార్కెట్ అధికారులు వ్యాపారులకు సహకరిస్తున్నారని పలువురు నాయకులు, రైతులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి నష్టపోయిన రైతులను బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కొణిజేటి భిక్షపతి కలిశారు. మార్కెట్‌కు తీసుక వచ్చిన మొక్కజొన్నలు అకాల వర్షంలో కొట్టుకు పోయాయని రైతులు వారి దృష్టికి తీసుకవచ్చారు. మార్కెట్ అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై తేమ శాతం ఎక్కువగా ఉందన్న సాకుతో వారం, పది రోజులైన కొనుగోళ్లు చేయడం లేదని వాపోయారు. షెడ్లల్లో సుమారు 1,500 బస్తాలు పేరుకుపోయాయని వారు తెలిపారు. దీంతో ఆరుబయట మొక్కజొన్నలను ఆరబోయడంతో వర్షానికి తడిసి పోతున్నాయని వారు చెప్పారు. అనంతరం షెడ్‌లోని బస్తాలను తక్షణమే ఖాళీ చేయాలని వారు మార్కెట్ సూపర్‌వైజర్ జ్యోతిప్రకాశ్‌కు వినతి పత్రం అందించారు. కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గై లక్ష్మణ్, పీఏసీఎస్ డైరెక్టర్ రెడ్డబోయిన కుమారస్వామి, రైతులు శాద యాదవరెడ్డి, మేకల రమేష్, గర్నెపెల్లి సమ్మిరెడ్డి, గుగులోత్ భద్రి, హరిచంద్రు, బాలు, బాలాజీ పాల్గొన్నారు.

చిన్నారులను జాగ్రత్తగా కాపాడుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్. వెంకన్న

నర్సంపేట : వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సి బాధ్యత ప్రతీ తల్లిదండ్రులపై ఉందని, ఎంత పని ఒత్తిడి ఉన్నా చిన్నారులకు సమయం కేటాయించి వారిని గమనించాలని సెక్టార్ సూపర్‌వైజర్ ఝాన్సీ, కౌన్సిలర్ రుద్రమల్లీశ్వరి సూచించారు. నర్సంపేట ప్రాజెక్టు పరిధిలోని నర్సంపేట-4 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ మేరకు ప్రీ స్కూల్ పిల్లల తల్లిదండ్రులతో ఏఎల్ఎంఎస్‌సీ కమిటీ సమావేశం 13వ వార్డు కౌన్సిలర్, ఏఎల్ఎంఎస్‌సీ కమిటీ చైర్మన్ రుద్ర మల్లీశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు సెల్ ఫోన్ ఇవ్వడం వల్ల జరిగే నష్టాల గురించి వివరించారు. పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. మే నెలలో అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ లేదా ఆయా తప్పకుండా ఉంటారు కాబట్టి ప్రతి రోజు అంగన్‌వాడీ కేంద్రానికి ప్రీ స్కూల్ పిల్లలను పంపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఎస్‌ఎల్‌ఎఫ్ అధ్యక్షురాలు వాసం కరుణ, మునిసిపల్ కో ఆప్షన్ సభ్యురాలు నాయిని సునీత, మాజీ వార్డు మెంబర్, ఏఎల్ఎంఎస్‌సీ సభ్యురాలు , ఏఎల్ఎంఎస్‌సీ సభ్యులు ఎలకంటి జయ, అంగన్‌వాడీ టీచర్స్ నల్లా భారతి, ఎండి.గౌసియా, ఆయా సునీత, ఆశ రాజమణి, కొత్తపల్లి తేజస్విని, అలీమ, రాబియా, సాబీరా,తహరీం, అనూష, పవిత్ర, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

పంటల పరిశీలన



నల్లబెల్లి : అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎంసీపీఐ(యు) మండల కార్యదర్శి దామ సాంబయ్య అన్నారు. ఈ మేరకు మండలంలోని పలు గ్రామాల్లో నష్టపోయిన మొక్కజొన్న, వరి పంటలను ఎంసీపీఐ(యు) ప్రతినిధుల బృందం పరిశీలించారు. రైతులు తమ సమస్యలను నాయకులతో ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ.. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మొక్కజొన్న, వరి పంటలు తీవ్రంగా నష్టపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులకు ప్రతి ఎకరాకు రూ.50 వేలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మార్తా నాగరాజు, కొంరయ్య, రాజశేఖర్, బొల్ల సుదర్శన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ముగింపు సభను విజయవంతం చేయాలి



రాయపర్తి: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు



వర్ధన్నపేట: పోస్టర్ ఆవిష్కరిస్తున్న చొక్కయ్య

రాయపర్తి : దళితశక్తి ప్రోగ్రాం(డీఎస్పీ) విశారదన్ మహరాజ్ చేపట్టిన స్వరాజ్య పాదయాత్ర ముగింపు సభను విజయవంతం చేయాలని డీఎస్పీ మండల అధ్యక్షుడు గారె వెంకటస్వామి కోరారు. బుధవారం మండలకేంద్రంలో సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో ముగింపు యాత్ర సభ జరుగుతుందన్నారు. ఈ సభకు అభిమానులు, నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా కోశాధికారి రొడ్డ మురళీకృష్ణ, తుమ్మల ప్రశాంత్, కొత్తూరు మల్లేష్, గారె ప్రవీణ్, ఐత రాకేష్, ఐత రాజు, లాలుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

వర్ధన్నపేట : డీఎస్పీ అధినేత డాక్టర్ విశారదన్ బీసీ, ఎస్సీ, ఎస్టీల స్వరాజ్య స్థాపనకు చేపట్టిన పదివేల కిలోమీటర్ల పాదయాత్ర ముగింపు పోస్టర్‌ను బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కొండేటి చొక్కయ్య ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కో ఆర్డినేటర్ మురళీకృష్ణ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో నిర్వహించే డాక్టర్ విశారదన్ మహరాజ్ పాదయాత్ర ముగింపు సభకు మేధావులు, యువకులు, బహుజన నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుమ్మల ప్రశాంత్, తూళ్ల హరీష్, రంజిత్, శివాజీ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

రాయపర్తి : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర లభిస్తోందని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ కోరారు. బుధవారం మండలంలోని తిర్మలాయపల్లి, బంధనపల్లి, కొత్తూరు, పెర్కవేడు, గట్టికల్, సన్నూరు, బాల్‌నాయక్‌తండా, వెంకటేశ్వరపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణను వినియోగించుకోవాలి

గ్రామాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణను మహిళలు వినియోగించుకోవాలని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ కోరారు. బుధవారం మండలంలోని కొత్తూరు, సన్నూరు గ్రామాల్లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టుశిక్షణ కేంద్రాలను వారు ప్రారంభించి, మాట్లాడారు. రైతుబంధు అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, పీఏసీఎస్‌చైర్మన్ రామచంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, డీపీఎం భవాని, ఏపీఎం, సర్పంచ్, ఎంపీటీసీలు, సీసీలు, వీఓఏలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సెల్ ఫోన్ అప్పగింత



గీసుకొండ : ఓ వ్యక్తి ఫంక్షన్ హాల్‌లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్(సీఈఐఆర్) అప్లికేషన్ ద్వారా కనుగొని గీసుకొండ పోలీసులు సదరు వ్యక్తికి అప్పగించారు. సంగెం మండలం పల్లార్లగూడకు చెందిన బొమ్మల రాజ్‌భరత్ ఇటీవల గీసుకొండ మండలం మరియపురం శివారులోని ఓ గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న సందర్భంగా తన సెల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. అతడు ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ అప్లికేషన్ సహాయంతో ఫోన్‌ను ట్రాక్ చేసి బుధవారం బాధితుడికి అప్పగించినట్లు గీసుకొండ ఎస్సై వెంకన్న తెలిపారు.

ఫర్టిలైజర్స్ కమిటీ ఎన్నిక

ఆత్మకూరు : మండల ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ వ్యాపారుల కమిటీ బుధవారం మండలకేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అర్షం కుమారస్వామి, ఉపాధ్యక్షులుగా సిరంశెట్టి సుమన్, బైరి సూర్యప్రకాశ్, ప్రధానకార్యదర్శిగా పోతరాజు రాము, కోశాధికారిగా నర్మెట్టి రవితేజ, సహాయ కార్యదర్శిగా కంచ రవీందర్, ముఖ్యసలహాదారులుగా రేవూరి దేవేందర్‌రెడ్డి, ముద్దం మల్లికార్జున్, తాటిపెల్లి రవీందర్, ఆర్గనైజర్లుగా మిరియాల రాజు, బలవంతుల రాజు, కార్యవర్గసభ్యులుగా కొండగాని ప్రసాద్, కీత రజనీకాంత్, ప్రేమ్‌కుమార్, రాజు ఎన్నికయ్యారు.

వడగళ్లు.. అన్నదాతకు కన్నీళ్లు



చెన్నారావుపేటలో నేలకొరిగిన వరి పంట



రాయపర్తి: పరదాలు కప్పి భద్రపర్చుకున్న రైతులు

వరి, మొక్కజొన్న పంటలకు అపారనష్టం

దుగ్గొండి : మండలంలోని పలు గ్రామాలలో నాలుగు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. వరుసగా కురుస్తున్న వడగళ్ల వర్షాలు అన్నదాతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వరి పంట పూర్తిగా నేలమట్టమయింది. వరి గింజలు రాలిపోయాయి. పెట్టుబడి రాని పరిస్థితి నెలకొంది. గతంలో కురిసిన వర్షాలకు మొక్కజొన్నంతా ధ్వంసం కాగా ఈ వర్షాలకు వరి పంట సైతం అక్కరకు రాకుండా పోయిందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి వరి పంటకు నష్టపరిహారం వర్తింప జేసి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

గుబులు చెందుతున్న అన్నదాతలు

రాయపర్తి : నల్లని కారుమబ్బులను చూస్తూ ఎప్పుడు వర్షం పడుతుందో ధాన్యం తడుస్తుందోనని రైతులు దిగాలు చెందుతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం వర్షార్పణం అవుతుందోనని ఆవేదన చెందుతున్నారు. త్వరగా వడ్లను కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసిన ధాన్యం కాంటాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కారుమబ్బులను చూసి చలిస్తున్న రైతులు వారు పండించిన వరిధాన్యం రాసులపై పరదాలు, టార్పలిన్ కప్పుకొని భద్రపర్చుస్తు జాగ్రత్తలు పడుతున్నారు. ఉదయం ఎండ వచ్చినప్పుడు ఆరబోస్తూ సాయంత్రం లోపు కుప్పగా చేసి పరదాలు కప్పుకొని కొట్టుకుపోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

నష్టాల్లో రైతులు

చెన్నారావుపేట : మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు కుదేలవుతున్నారు. చేతికొచ్చిన వరి, మొక్కజొన్న పంటలు పూర్తి నేలవాలి దెబ్బతిన్నాయి. కూరగాయలు సాగు చేసిన రైతులు పూర్తిగా నష్టపోయారు. వెంటనే ప్రభుత్వం సర్వే నిర్వహించి ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

‘జన జాతర’ను జయప్రదం చేయాలి

వరంగల్(పర్వతగిరి) : మహాత్మా జ్యోతిబా పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని సామాజిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 27న రంగశాయిపేట గవిచర్ల క్రాస్‌రోడ్డులోని లక్ష్మి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్న పూలే, అంబేడ్కర్ జన జాతర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పోడేటి దయాకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో ప్రజా సంఘాల ముఖ్య నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ పూలే, అంబేడ్కర్ జన జాతర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు, రాష్ట్ర నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు. మేధావులు, యువజనులు, మహిళలు, కవులు, కళాకారులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

పిడుగుపాటుకు పశువులు మృతి



రాయపర్తి: కాట్రపల్లిలో మృతిచెందిన దుక్కిటెద్దు



పర్వతగిరి: మృతి చెందిన పాడి ఆవు

రాయపర్తి : పిడుగుపాటుకు పశువులు మృతి చెందిన ఘటనలు ఆయా మండలాల్లో జరిగాయి. రాయపర్తి మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన ఎండీ యాకూబ్ వ్యవసాయ పొలం వద్ద దుక్కిటెద్దును కట్టేశాడు. మంగళవారం రాత్రి కురిసిన వర్షాలకు పిడుగుపడి ఎద్దు అక్కడికక్కడే మృతిచెందింది. బుధవారం ఉదయం అక్కడికి వెళ్లి చూసేసరికి ఎద్దు మృతిచెంది ఉంది. రూ.50వేల విలువ చేసే దుక్కిటెద్దు మృతి చెందడంతో రైతు కుటుంబం సభ్యులు దిగాలు చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని యాకూబ్ కోరాడు.

పర్వతగిరిలో..

వరంగల్(పర్వతగిరి) : మండలంలోని దేవీలాల్ తండాలో బానోత్ చక్రుకు చెందిన పాడి ఆవు మంగళవారం అర్ధరాత్రి పిడుగు పాటుతో మృతి చెందింది. సుమారు రూ.60వేలు విలువ చేసే పాడి ఆవు మృతి చెందిందని చక్రు కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

‘కంటి వెలుగు’ను వినియోగించుకోవాలి

నర్సంపేట : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ నాగిశెట్టి పద్మప్రసాద్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని పదోవార్డులోని పోచమ్మ ఆలయం వద్ద బుధవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆశ వర్కర్స్, సీఏలు, మున్సిపల్ అధికారులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు పూర్తి..

గీసుకొండ : మండలంలో కంటి వెలుగు కార్యక్రమం ద్వారా అన్ని గ్రామాల్లో కంటి పరీక్షల శిబిరాలు నిర్వహించామని పీహెచ్‌సీ డాక్టర్ మాధవీలత తెలిపారు. జనవరి 19న కార్యక్రమం ప్రారంభం కాగా బుధవారం నాటికి పూర్తి చేశామని పేర్కొన్నారు. మండలంలో 29, 649 మందికి పరీక్షలు చేసి 4,776 మందికి రీడింగ్ అద్దాలు, 2,371 మందికి ప్రిస్కిప్షన్ అద్దాలను పంపిణీ చేసినట్లు వివరించారు. కంటి వెలుగు కార్యక్రమానికి సహకరించిన స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్య సిబ్బందికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.